

# పుస్తక పరిచయం




**కొత్తగళంతో,** కొత్తకలంతో కవితారంగంలోకి అడుగుపెట్టిన ప్రవాసాంధ్ర కవి రవి వీరెల్లి. ఈయన అక్షరాల నిండా మట్టివాసనని నింపుకుని వచ్చారు, పదాలనిండా జ్ఞాపకాలని పొదువుకుని వచ్చారు, వాక్యాలనిండా 'నిన్ను' నింపుకుని వచ్చారు...వెరసి చక్కటి చిక్కటి కవిత్వంతో సరికొత్తగా పలకరించడానికి 'దూప'తో కవితాప్రియుల ముందుకి వచ్చారు. 'పోయిన రెండేండ్లలో చేసిన నా సాహిత్య యాత్రకి అక్షర రూపం నా ఈ మొట్టమొదటి సంకలనం' అన్నారు కానీ కవిగా ఆయనకి ఎన్నో సంవత్సరాల అనుభవం ఉన్నట్లే అనిపిస్తుంది, ఈ సంపుటిలోని కవితా సాంద్రతని గమనిస్తే. చదువరికి ఒక్కో కవితా ఒక్కో జ్ఞాపకంగా మిగులుతుంది. మరొక్కసారి వెనక్కు తిరిగి అద్భుతమైన పదచిత్రాలని ఇంకోసారి మనసారా ఆస్వాదించాలనిపిస్తుంది. 'కాలం వదిలి వెళ్ళిన జ్ఞాపకాల నీడల్లో / నీకై ప్రతీక్షించే నాకు వృద్ధాప్యం వచ్చిన అలికిడే వినిపించలేదు' , 'పేనుకున్న జ్ఞాపకాల తాడు / రెండు కొసలూ నేనే పట్టుకుని / దిగులు అట్టడుగు పొరల్లో ఎక్కడో / నేను' - ఇవి కవి జ్ఞాపకాలే కాదు, జీవితాన్ని కౌగలించుకున్న ప్రతి పాఠకుడి జ్ఞాపకాలు కూడా. 'నీకు / కాచుకోడానికి వెలుగు కుంపట్లు / కప్పుకోడానికి వెన్నెల దుప్పట్లూ తెచ్చిస్తా / ఏడాదంతా నా రుతువుల రథం మీద సవారి చేయిస్తూ ' నేలతల్లిని ఇంత వినూత్నంగా ఎవరూ చూపించలేదేమో! 'వత్తి సరి చేసుకోవాలే కానీ / గతం దీపం బుడ్డి నిండా బోల్డన్ని జ్ఞాపకాలు ' అంటూ ప్రతి హృదయాన్నీ స్పృశిస్తారు. ముందుమాటలో ప్రముఖ కవి అఫ్సర్‌గారు "రవి జీవితంలో కానీ కవిత్వంలో కానీ ఈ నాలుగు చోట్లూ - ఆముదాలపల్లెలో ఆరు బయలో, కరీమ్‌నగరులో మిద్దెమీదో, హైదరాబాద్‌లోని ఏడంతస్తుల మేడో, వర్జీనియాలోని రోనోక్ నగరమో - కనిపించకపోతే ఆ దృశ్యం అసంపూర్ణంగా మిగిలిపోతుంది " అన్నారు. రవి వీరెల్లి గారి కవితలన్నీ పరిపూర్ణత్వాన్ని సంతరించుకున్నవే. ఆయా ప్రదేశాలని, తన అనుభవాలని కవిత్వీకరించి, మనల్నీ వాటిలో మమేకం చేసిన కవి రవిగారిని అభినందించి తీరాలి. 'మంచి కవిత్వం అంటే ఏమిటి?' అని ఎవరైనా అడిగితే సమాధానంగా ఈ 'దూప'ని చూపించండి.

***

*Writer Contact:*
**Ravi Verelly**
**6003 Matissa Ln**
**Roanoke, VA - 24018**
**ravinder.verelly@gmail.com**

***Available at:***
**All leading book stalls**

***e-book:* www.kinige.com**




**అత్యుత్తమ** సాహితీ విలువలతో 'ఈమాట' పత్రికని నడిపిస్తున్న సంపాదకులు, అమెరికాలోని సీనియర్ రచయిత శ్రీ వేలూరి వేంకటేశ్వరరావుగారు వ్రాసిన కథల సంపుటి 'ఆ నేల, ఆ నీరు, ఆ గాలి'. ముందుమాటలో రచయిత చెప్పుకున్నారు "గత యాభై యేళ్ళలో నేను ఒక పాతిక పై చిలుకు 'కథలు', మరో పాతిక సాహితీ 'వ్యాసాలు' రాసి ఉంటాను. సగటున రెండేళ్ళకో కథ, ఒక వ్యాసం అన్నమాట" అని.. రాసి కంటే వాసికి ఎంత విలువనిస్తారో వేలూరిగారి సాహితీ వ్యాసంగం తెలియచేస్తుంది. ఎంతో గాఢమైన అనుభూతి చెందితే తప్ప, మనసుని కదిలించే సంఘటనలు, ఆలోచనలు తారసపడితే తప్ప కథారచనకి పూనుకోరని చెప్పకనే చెప్పారు రచయిత. ఈ నాణ్యత ప్రతి కథలోనూ కనిపిస్తుంది. కథా వస్తువుని ఎన్నుకోవడంలో కానీ, రచనాశైలిని ఒక అందమైన శిల్పంలా తీర్చిదిద్దడంలో కానీ వేలూరిగారి ప్రత్యేకత కొట్టొచ్చినట్లు కనిపిస్తుంది. ప్రతి కథలోనూ 'ఆత్మ' ఉంది. ఆ అత్మే పాఠకుడిని చివరంటా చదివిస్తుంది. చదువరుల కళ్ళు చెమరింపచేసే మొట్టమొదటి కథ 'గొమేజ్ ఎప్పుడొస్తాడో?'. అమెరికావాసులకి ఇలాంటి గొమేజ్‌లు చాలా మంది పరిచయం ఉండొచ్చు కానీ, రచయిత ఈ కథకి ఇచ్చిన ముగింపు కరుణ రసాన్ని పరాకాష్టకి తీసుకెళ్ళింది. దీనికి సరితూగ గలదే 'క్లబ్బులో చెట్టు కథ'. నడకలో సరళత, చిత్రించే సంఘటనలని కళ్ళముందు నిలబెట్టగల వాక్యనిర్మాణం ఈ కథలో స్పష్టంగా కనిపిస్తాయి. ముందుమాట వ్రాసిన వాసిరెడ్డి నవీన్‌గారు 'వ్యంగ్యాన్ని ఆయుధంగా చేసుకుని రచనలు చేస్తున్న ఒకరిద్దరు రచయితల్లో వేలూరి వేంకటేశ్వరరావు ఒకరు' అన్నారు. వ్యంగ్య కథల్లోనైనా నేలవిడిచి సాముచేసే తత్వం లేకపోవడం, పాత్రల చిత్రణలో తనదైన విలక్షణత చూపించడం - వంటి లక్షణాలతో వేంకటేశ్వరరావుగారు నిఖార్సయిన కథారచయితగా నిలబడ్డారు. పుస్తకం చివరలోని కథాచిత్రాలూ గాఢంగా ఆలోచింపచేస్తాయి. 'తరం మారినా',' యాది',' దాలిగుంటలో లియా',' న్యాయమందిరం,' ఎగిరే గుర్రాలు','తీన్ కన్యా'.. ఇలా .. పుస్తకం చదవడం పూర్తయే సరికి చాలా కాలానికి మంచి సాహిత్యాన్ని చదివిన అనుభూతి మిగులుతుంది.

***

*Writer Contact:*
**Veluri Venkateswara Rao**
**1853 Royal Troon Ct**
**Duluth , GA 30097**
**vveluri@gmail.com**

*Sole Distribution:*
**Navodaya Publishers**
**Eluru Road, Vijayawada**

*e-book:* **www.kinige.com**

ఈ శీర్షికలో తమ పుస్తక పరిచయాలు ప్రచురింపబడాలనుకునే వారు, తమ పుస్తకాలు ఒక్కొక్క కాపీని క్రింది ఎడ్రసుకి మెయిల్ చెయ్యవలసిందిగా 'కౌముది' విజ్ఞప్తి చేస్తోంది.

**Editor,**
**KOUMUDI(Web Monthly)**
**4251 - Escudo Ct**
**Dublin - CA 94568, USA**